కియోస్క్‌లపై కినుక

- ఆర్‌ఎస్‌కేల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- ఎరువులు, పురుగు మందులు అందక రైతుల అవస్థలు
- ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు ఎరువుల విక్రయాలు
- రైతులకు తప్పని ఇబ్బందులు



పామర్రులో మూత పడిన ఆర్‌ఎస్‌కే

పామర్రు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాలలో 210 విత్తన ఏటీఎంలు నిరుపయోగంగా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల వస్తువులు, ఎరువులు, ఆక్వా ఫీడ్ మార్కెటింగ్ సేవలు అన్ని పారదర్శకంగా రైతుల ఇంటి ముంగిటకి అందేలా ప్రతి సచివాలయ పరిధిలోని ఆర్‌బీకేల్లో కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినా, కియోస్క్ యంత్రాలను మాత్రం నిరుపయోగంగా ఉంచారు.



ఆర్‌ఎస్‌కేలో నిరుపయోగంగా కియోస్క్

కియోస్క్ సేవలు ఇవీ..

పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని 220 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి ఆర్‌బీకే (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)లోనూ ఒకటి చొప్పున కియోస్క్ యంత్రం ఏర్పాటు చేశారు. ఈ యంత్రాలతో విత్తనాలు, ఎరువులు , పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసే టప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గల్లో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలు ఈ యంత్రం ద్వారా పొందారు.

కియోస్క్ సేవలపై నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో 210 కియోస్క్ యంత్రాలను వినియోగించడం లేదు. కనీసం ఎరువులను బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించక పోవడంతో వృథాగా ఉంటున్నాయి. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు.

నియోజకవర్గం పేరు	రైతు సేవా కేంద్రాలు	కియోస్క్ యంత్రాలు
పామర్రు	72	72
గుడివాడ	38	38
కైకలూరు	110	100
	220	210

కూటమి ప్రభుత్వంలో మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. రైతులు చేసేదేమీ లేక ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు.

కియోస్క్‌లను వినియోగించాలి..



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ విధానం ద్వారా తెలియజేశారు. కియోస్క్‌లను వినియోగించాలి.

– ఏ శ్రీనాథ్‌రెడ్డి, రైతు, పామర్రు

ఎరువులు అందించాలి..



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులను పూర్తి స్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేక పోయింది. దీంతో ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరహాలో ప్రస్తుత ప్రభుత్వం సరఫరా చేయాలి.

– కె.సుబ్బారెడ్డి, రైతు, పామర్రు

వినియోగంలోకి తెస్తాం..



రైతు సేవా కేంద్రాలలో కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివనాగరాణి, ఏవో పామర్రు

క్లుప్తంగా

వ్యాసరచన పోటీలో విద్యార్థిని ప్రతిభ



పామర్రు: వ్యాసరచన పోటీలో తమ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారని ఏఎస్‌ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్‌ఎం హైస్కూల్‌లో విద్యార్థిని జీ దినీష ప్రియను శనివారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమస్థానం, 22న జిల్లా స్థాయి పోటీలో ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ప్రశంసాపత్రం, షీల్డులను అందుకుందని తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు శామ్యూల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోస్టల్ ఖాతాల్లో నగదు జమ చేయాలి



గుడ్లవల్లేరు: విన్నకోట సబ్ పోస్టాఫీసులో బీపీఎం ఈడే రాజా వినియోగదారుల నుంచి కొట్టేసిన సొమ్మును నిగ్గు తేల్చి..వెంటనే పోస్టల్‌కు కట్టే విధంగా సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఆయన నాయకత్వాన వినియోగదారులంతా విన్నకోటలో ఆందోళన చేపట్టారు. బాధిత వినియోగదారుల సొమ్మును వారి ఖాతాల్లో నమోదు చేయాలని శ్రీనివాసరరావు కోరారు. సౌర విద్యుత్‌లో అవినీతికి కారకుడైన ఆదానీని వెంటనే అరెస్టు చేయాలని వివిధ గ్రామాల్లో శ్రీనివాసరరావు ఆధ్వర్యంలో ఆందోళనకారులు నిరసన చేపట్టారు.

వాహనాల తనిఖీ

గుడివాడరూరల్: మండలంలోని సిద్ధాంతం అడ్డరోడ్డు సమీపంలో శనివారం ఎస్‌ఐ ఎన్. చంటిబాబు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్‌లు లేని వారిపై అపరాధ రుసుం విధించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించి, తమకు సహకరించాలని కోరారు.

మార్గదర్శి మన రాజ్యాంగం



మండవల్లి: జీవన విధానాన్ని నిర్దేశించే మార్గదర్శి రాజ్యాంగం అని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ ఎస్ భాస్కరరావు, మండలశాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, కోశాధికారి బండారు వెంకయ్య అన్నారు. ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో భారత రాజ్యాంగ పీఠిక ఫ్లెక్సీ బ్యానర్లు ప్రదర్శించి, విద్యార్థులతో చదివించి అవగాహన కల్పించారు. అనంతరం రాజ్యాంగమే మన ధర్మశాస్త్రం అనే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు సౌజన్య, నాగమల్లి, కనకరత్నం, ప్రసన్న, అంజిని పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లలో గుంతలు పూడ్చాలి

గుడివాడ టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చాలని సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. స్థానిక విజయవాడ రోడ్‌లో శనివారం నాయకులు గుంతలలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఏజేకే హైస్కూల్ ఎదురు రోడ్డు, రాజబాపయ్య చౌక్, నెహ్రూచౌక్ సెంటర్ మధ్య, కారుల స్టాండ్ రోడ్డు, ఇతర ప్రాంతాలలో భారీగా గుంతలు ఏర్పడ్డాయని వీటిని తప్పించబోయి ద్విచక్ర వాహనదారులు రోడ్లపై పడి గాయాల పాలవుతున్నారన్నారు. ప్రజలను ఇబ్బందుల నుంచి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలపై స్పందించి గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి.రజిని, ఎల్.సురేంద్ర, ఆర్.కొండ, ఎ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపలు మృతి

ముదినేపల్లి రూరల్: పెయ్యేరు పంచాయతీకి చెందిన తాగునీటి చెరువులో చేపలు చనిపోయాయి. దీంతో నీరంతా కలుషితంగా మారడంతో తాగునీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ చేపలు వ్యాధుల బారిన పడి చనిపోయాయా లేక మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. చెరువులోని చేపలను తొలగించి నీటిని శుభ్రపరిచేందుకు పంచాయతీ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు.

26న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. శనివారం స్థానిక మార్వాడి గుడి సెంటర్‌లో నిరసన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధానాల వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు తలొగ్గి ఉద్యోగుల భద్రతకు రక్షణ లేకుండా పాలన జరుగుతుందన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం మచిలీపట్నంలో జరిగే కార్యక్రమంలో వేలాదిగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.సురేష్, సాహితీ స్రవంతి పట్టణ అధ్యక్షుడు లంకా సురేంద్ర, వామపక్ష నాయకులు షేక్ మూసా, ఎస్.రాంబాబు, జి.మూర్తి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు



గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ వారంలో తమ ఫార్మసీ విద్యార్థులు వివిధ గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్ని చైతన్య పరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమా రంగంలో ఉపాధి అవకాశాలు మెండు



ప్రసంగిస్తున్న శ్రీనాథ్

గుడివాడ టౌన్: రానున్న రోజుల్లో భీమారంగంలో స్వయం ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జాతీయ భీమారంగం గుడివాడ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనాథ్ అన్నారు. శనివారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'భీమారంగంలో వృత్తి అవకాశాలు' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ భీమారంగంలో అనేక రకాల ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థి దశ నుండే పెట్టుబడులపై, భీమారంగంలో అవగాహన పెంచుకుని వాటిని అవలంభించేందుకు కృషిచేస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు ఎంబీ సువర్చల, వి.నాగేంద్ర కుమార్, ఆర్ఎంఏ ప్రసాద్, ఎం.జేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

కైకలూరు: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు కైకలూరు సత్యసాయి సేవా సమితి మందిరంలో శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం ఓంకారం, సుప్రభాతం, మహానగర సంకీర్తన, స్వామి పాదుక అష్టోత్తరం, పాదుకపూజ, బొమ్మినంపాడు గంగానమ్మ భక్తబృందంతో భజన, అన్నప్రసాద వితరణ, జ్యోతి ప్రజ్వలన, కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిగాయి. తానా ప్రసాద్, సమయమంతుల పురుషోత్తం, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

296 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో వడ్లమన్నాడు హైస్కూల్స్‌లో 296 మంది విద్యార్థులకు శనివారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. నర్రా గంగాధరరావు, నిర్మలాకుమారి దంపతుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. 27 మందికి కళ్లజోళ్లకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈవో పద్మవాణి, గ్రామస్తులు

ప్రాకర్ల(పామర్రు): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాయన శివరామ ప్రసాద్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పామర్రు ఎంఈవో- 2 పద్మవాణి పేర్కొన్నారు. మండల పరిధి ప్రాకర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్తిక వన సమారాధన కార్యక్రమం గ్రామస్తులు, ఉపాధ్యాయులు కలిసి శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో మాట్లాడుతూ చిన్న వయస్సులో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఎంతో ప్రశంసనీయమన్నారు. తోటి ఉపాధ్యాయులు అందరూ శివరామప్రసాద్ నిర్వహిస్తున్న వినూత్న విద్యా బోధనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంఈవో, గ్రామస్తులు శివరామప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పని చేసి కూర్మాపురం బదిలీపై వెళ్లిన అంకరవి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కె.గణేష్, పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ ఎం. లక్ష్మీలత, గ్రామ సర్పంచ్ జి.రామలింగేశ్వరరావు, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ జి.నాగదుర్గ, గ్రామ మాజీ సర్పంచ్ కాకి నిర్మల, ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది, సీఆర్పీలు, తల్లి దండ్రులు, గ్రామ పెద్దలు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలనేకం

మండవల్లి: మాదక ద్రవ్యాలు తీసుకుంటే అన్నీ అనర్థాలేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్‌కే రమేష్ అన్నారు. లోకుమూడి వికాస్ జూనియర్, డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను విక్రయించడం వలన పడే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎస్సైలు ఆదినారాయణ, అలీం, సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ సెక్రటరీ అవినీతికి పాల్పడుతున్నారు'



మాట్లాడుతున్న కైకలూరు సర్పంచ్ మేరీ నవరత్నకుమారి

కైకలూరు: పంచాయతీ సెక్రటరీ అవినీతికి పాల్పడుతున్నారని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఆరోపించారు. పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో శనివారం ఆమె మాట్లాడుతూ తాను మూడేళ్లుగా పాత పంచాయతీ కార్యాలయం గదిలో విధులు నిర్వహిస్తున్నానన్నారు. గతంలో ఒకే గదిలో సెక్రటరీ, తాను ప్రజా సమస్యలను అక్కడికక్కడ పరిష్కరించేవారమన్నారు. అయితే ప్రస్తుత సెక్రటరీ తన కుర్చీని బయట పడేశారన్నారు. పంచాయతీ ఆర్థిక లావాదేవీలు చలానాల ద్వారా గ్రామ అకౌంట్‌కు జమ చేయాలన్నారు. కానీ సెక్రటరీ ఎంఆర్ విధానంలో చెల్లిస్తున్నారని, దీని వల్ల పంచాయతీ జమ నిధుల వివరాలు తెలియడం లేదన్నారు. ట్యాప్ కనెక్షన్లు, ప్లాన్ అప్రూవల్స్, పన్ను నిర్ణయించడంలో అవినీతికి పాల్పడుతున్నారని తనకు సమాచారం ఉందన్నారు. గతంలోనూ వివిధ ప్రాంతాల్లో సెక్రటరీపై పలు అవినీతి కేసులలో ఏసీబీకి పట్టుబడ్డారని చెప్పారు. సెక్రటరీ ప్రవర్తనపై స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

విచారణకు సిద్ధం..

సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చేసిన ఆరోపణలు అవాస్తవమని, తాను ఈ విషయంలో విచారణకు సిద్ధమని పంచాయతీ కార్యదర్శి ఆనంద భూషణం స్పష్టం చేశారు. తాను ఇటీవలే విధులలో చేరానని, నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ గదిలో సెక్రటరీ మాత్రమే విధులు నిర్వహించాలన్నారు.

నేడు గౌడ సంఘం కార్తిక వన సమారాధన

మండవల్లి: నియోజకవర్గ గౌడ సంఘ 20వ కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గౌడసంఘం నాయకులు పోసిన చెంచు రామారావు, బొర్రా చెలమయ్య తెలిపారు. భైరవపట్నం శివారు శోభనాద్రిపురం శివాలయంలో కార్తిక వనసమారాధన నిర్వహించనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నూతనంగా పదవులు పొందిన వారిని సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను శనివారం సమీక్షించారు. పరస ఏడుకొండలు, వన సమారాధన కమిటీ చైర్మన్ పడమటి గణేష్, కట్టా నాగబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియానికి నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం నూతన పాలక వర్గ ఎంపిక శనివారం జరిగింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయన్నారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడిగా యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా కె.రంగప్రసాద్ ఎన్నిక కాగా కార్యవర్గ సభ్యులుగా ఎ.భవాని ప్రసాద్, జి.వెంకటరత్నం, జి. రాఘవేంద్రరావు, ఎం.లక్ష్మణరావు, ఎం.వీరభద్రరావు, ప్రవీణ్‌కుమార్ జైన్, డి. రవి, వి.ప్రసాద్, పి.రూపలావణ్య, డాక్టర్ పి.వంశీకృష్ణ, ఎస్.రత్నశేఖర్, ఎ. శ్రీదేవిలు ఎంపికైనట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మస్తాన్

మొవ్వ: మండలంలో రెండు రోజులు పాటు ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో తొలి రోజైన శనివారం పోలింగ్ కేంద్రాల్లో నామమాత్రపు స్పందన కనపడింది. మండల తహసీల్దార్ కే మస్తాన్, ఆర్‌ఐ ఏ విజయదుర్గ నిడుమోలు, అవురుపూడి, అయ్యంకి, పెడసనగల్లు, భట్ల పెనుమర్రు, కూచిపూడి కేంద్రాలను పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ లంకే రామ్మోహన్‌రావు మొవ్వ, గూడపాడు, పెదపూడి, యద్దనపూడి గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటు నమోదు కార్యక్రమంపై ఆరా తీశారు. ఆదివారం కూడా నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

గుడివాడ టౌన్: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని వాటిలో వసతులు అనుకూలంగా ఉన్నట్లు ధ్రువీకరించామన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా ఫొటో కరెక్షన్, ఓటర్‌లిస్ట్ వెరిఫికేషన్ చేసేటప్పుడు ఏవైనా తప్పులు ఉంటే సవరణకు అర్జీ పెట్టుకోవచ్చన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డే ఆదివారం కూడా కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

నేడు రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ వన సమారాధన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పామర్రు: స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్‌ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో వన సమారాధన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమారాధనలో 26 మంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, 23 మంది వృద్ధులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రాయూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ తమ్మా లలితాగోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి భీమవరపు శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బొంతు సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎం.కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

గుడివాడరూరల్: 18 ఏళ్లు నిండి అర్హత కలిగిన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు అన్నారు. శని, ఆదివారాలను ప్రత్యేక ఓటరు నమోదు దినాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆయా తేదీల్లో అర్హత కలిగిన వారు ఆయా గ్రామాలు, వార్డుల్లో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 24న బూత్‌స్థాయి అధికారులు వారికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నేత కోమటికి అభినందనలు



కోమటి విష్ణుకు అభినందనలు తెలియజేస్తున్న ఎంపీపీ, నాయకులు

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కోమటి విష్ణువర్ధన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఎంపీపీ రామిసెట్టి సత్యనారాయణ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన్ను సత్కరించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గంటా సంధ్య, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, షేక్ అల్లాభక్షు, సుధాకర్, భోగేశ్వరరావు, దివి సతీష్, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా ఉన్నారు.

వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల రద్దీ అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో ఈ అన్న సమారాధన జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తీర్థప్రసాదాల్ని స్వీకరించారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా ప్రదర్శన

గుడివాడరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటర్ల జాబితాను స్థానిక తహసీల్దార్, మున్సి పల్ కార్యాలయాల వద్ద ప్రచురించామని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 9వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితాలను తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలవద్ద ప్రచురించామన్నారు. ఓటు నమో దుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ జాబితాను పరిశీలించుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఓటు నమోదు కాని వారు ఫారం–18 ద్వారా డిసెంబర్ 9వ తేదీ లోపు, మార్పులు, చేర్పుల నమోదు, సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పామర్రు మండలంలో..

పామర్రు: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటర్ల జాబితాను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించామని సహాయ ఎన్నికల నమోదు అధికారి రవి కాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం వారు ఇంకనూ కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లగా నమోదు కాని పట్టభద్రులు ఓటరుగా నమోదు కోసం ఫారం-18ను దాఖలు చేయాలన్నారు. ఆర్‌ఐ రాము తదితరులు పాల్గొన్నారు.